# మబ్బుతెరలు

## కాళింగి సంధ్యారాణి

శ్రీదేవి ఆలోచిస్తోంది...

పదేపదే ఆమెకి వేణు గుర్తొస్తున్నాడు. అతని చిలిపిమాటలు, కొంటెచూపు... ఎందుకో ప్రతిక్షణం అతని సమక్షంలో గడపాలనిపిస్తుంది. అంత ఆకర్షణీయంగా వుంటాయతని కబుర్లు. ఎలాంటివారినయినా ఇట్టే ఆకర్షించి సమ్మోహనపరుస్తుందతని నవ్వు. పళ్ళు తళుక్కుమనేలా అమ్మాయిల మనసులో గుబులు పుట్టించేలా.

అతను తన ఎదురుగా వున్నప్పుడు తనకి పెళ్ళయింది అన్న సంగతి కూడా గుర్తు ఉండదు. అతనిలో ఎంత భావుకత్వం. తన మనసులో వున్న మాటని ఎదుటివారి హృదయానికి హత్తుకొనేలా ఎంత చక్కగా చెప్పగలడు. అందమైన సాయంత్రాలని ఆనందంగా సంపూర్ణంగా అనుభవించగలం. మనసుని ఎప్పుడూ ఉల్లాసంగా ఎలా ఉంచాలో అతనికి బాగా తెలుసు. అతను ఆఫీసులో చేరిన కొత్తలో తనకి పెళ్ళయిందని తెలిసిన మరుక్షణం అతని మొహంలో రంగులు మారడం బాధా వీచికలు తారట్లాడడం ఇప్పటికీ స్పష్టంగా గుర్తుంది.

"శ్రీదేవి, మీరు నిజమే చెబుతున్నారా, నిజంగా మీకు పెళ్ళయ్యిందా? అదీ పెళ్ళయ్యి నాలుగు సంవత్సరాలు. చాల్లెండి జోక్స్ వెయ్యకండి మీకింకా ఇరవయ్యేళ్ళు నిండాయో లేదో అని నేననుకుంటోంటే మీరేమో పెళ్ళయ్యి నాలుగేళ్ళవుతోంది అంటున్నారు..."

నవ్వొచ్చింది శ్రీదేవికి.

పుట్టినరోజు కొత్త చీర కట్టుకెళితే.

"వ్వావ్, వాటె బ్యూటీ, బ్రహ్మ ఎన్ని కష్టాలకి ఓర్చి మిమ్మల్ని తయారుచేసాడో కదా. మరి సరస్వతీ దేవి మీ అందాన్ని చూసి కుళ్ళుకోలేదుటండీ. ఇంకా నయం తనే కట్టుకోకుండా, మమ్మల్ని అన్యాయం చెయ్యకుండా భూమి మీదకు వదిలాడు. ఈ చీర మీకు కాబట్టే సరిగ్గా



నచ్చింది. అదే ఇంకెవరు కట్టుకున్నా దీని అందమే పోయేది. నిజంగా చెబుతున్నానండీ. మీరు చీర చాలా బాగా కట్టగలరు. అందులో స్ట్రక్చర్ చాలా బావుంటుంది కదా. ఇంత చక్కని స్ట్రక్చర్ వున్న ఆడపిల్లలు చాలా తక్కువ మందుంటారు. మీకులా సన్నని నడుమున్న వాళ్ళు నడుంపై ముడతలు లేకుండా చీరకడితే ఎంత బావుంటారు. చీరకట్టడం ఓ ఆర్టండీ..." అలా అతను తనని నఖశిఖపర్యంతం చూస్తూ లెక్చరిస్తోంటే సిగ్గుతో కుంచించుకుపోయింది. అయినా అతను అలా మాట్లాడ డాన్ని మనసులో ఏ మూలో ఇష్టపడుతూనే వుంది. సరిగ్గా అలాంటి సమయాల్లోనే భర్త ప్రసాద్ గుర్తు వస్తాడు. ఎంత కష్టపడి అలంకరించుకున్నా, ఎంత అందంగా వున్నా ఎలాంటి కామెంట్ చెయ్యడు. ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో తెలియదు. భార్య అందంగా వున్నప్పుడు రెండు చేతులతో ఆమె మొహాన్ని దగ్గరికి తీసుకుని పెదవులపై అమృత ముద్రనేసి "డార్లింగ్ ఈ రోజు నువ్వెంత స్మార్ట్‌గా వున్నావో తెలుసా. నేను ఇంత అందమైన భార్యకి భర్తగా వుండడానికి పోయిన జన్మలో ఎంత పుణ్యం చేసుకున్నానో కదూ అని అంటే ఆ భార్యకి ఎంత గర్వంగా వుంటుంది. ఒకసారి... ఒక్కసారన్నా... కనీసం అంటాడేమో అని ఎదురు చూస్తుంది. పొరపాటున కూడా నోరుజారడు. ఒక్కోసారి అనుమానం వస్తుంది. అసలు మనిషేనా ఇతను అని... ప్చ్.

"శ్రీదేవిగారూ! నేను మిమ్మల్ని నాలుగు సంవత్సరాలు ముందు చూసి వుంటే ఎంత బావుండేది. నా జీవితంలో నేను నాలుగు సంవత్సరాలు ఆలస్యం చేసి ఓ విలువయిన దాన్ని పోగొట్టుకున్నాను. అదేంటోనండీ చిన్నప్పట్నుంచీ ఒక్కసారి కూడా స్కూలుకి ఆలస్యం వెళ్ళేవాడిని కాను. కానీ జీవితంలో అతి ముఖ్యమయిన ఈ విషయంలోనే ఎందుకు ఆలస్యం చేసానో అర్థం కాదు. దేవుడు నాకు కనిపించి నీకేం వరం కావాలో కోరుకోమంటే ఈ కాలాన్ని నాలుగు సంవత్సరాలు వెనక్కి తిప్పమంటాను. అప్పుడు నా జీవితాన్ని చక్కగా మలుచుకుంటాను. మిమ్మల్ని పెళ్ళాడి నా జీవితాన్ని నందనవనం చేసుకుని వుండేవాడ్ని..."

అతను అలా మాట్లాడుతుంటే అనిపించేది తనకి కూడా అయ్యో ఈ కాలం వెనక్కి వెనక్కి వెళితే బావుండు అని. స్పందన లేని మొగుడితో ఎంతకాలం కాపురం చెయ్యగలదు. తనూ ఓ మనిషే, యంత్రం కాదు.

"శ్రీదేవి గారూ, నాకు బోలెడు సంబంధాలు వస్తున్నాయండీ. అమ్మా, నాన్నా పెళ్ళిచేసుకోమని బలవంతపెడ్తున్నారు. తమ్ముడి పెళ్ళికి కూడా అడ్డుగా వున్నాను. కానీ నా మనసుకి అర్థం చేసుకోవడానికి ఒక్కరూ ప్రయత్నించరే. నేను వేరొకరిని పెళ్ళి చేసుకుని వారిని సుఖపెట్టగలనా, నో... నేను ఆనందంగా వుండలేను. ఆవిడని ఆనందపెట్టలేను. అలాంటప్పుడు ఇక పెళ్ళి చేసుకోవడం ఎందుకండీ? నా హృదయం ఓ దేవతకి అంకితం ఇచ్చేశాను. ఆమె నిజంగానే నాకు అందనంత దూరంలో వుంది. పెళ్ళి చేసుకోవడానికి వీలులేదు. అయితే ఏం? నా ప్రేమ మలినమయినది కాదు. ఆమె శరీరాన్ని కోరుకోవడం లేదు. ఆమె మనసుమాత్రం నాదయితే చాలు. నా హృదయంలో ఆమెకు మాత్రమే స్థానం వుంది. ఇంకెవరికీ ఆ అర్హత లేదు. ఆమెని ఈ జీవితమంతా ఆరాధిస్తూనే వుంటాను..."

ఆ అమ్మాయి మీద అసూయ కలిగింది.

"ఎవరా అమ్మాయి?" తలవంచుకుని అడిగింది.

"శ్రీదేవి" చెప్పి అక్కడనించి వెళ్ళిపోయాడు.

అవాక్కయ్యింది. అంతగా అతను తనని ప్రేమిస్తున్నాడా? ఎందుకో, తెలియకుండానే కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

ఓ రోజు అతను కనీసం తనకి 'గుడ్ మార్నింగ్' కూడా చెప్పకుండా సీరియస్‌గా పనిచేసుకుంటూంటే తనే వెళ్ళి పలకరించింది.



## గోవిందా తెలివి

నేను అమితాబ్‌బచ్చన్‌లా ఉండాలనుకుంటున్నాను అంటూ యువ హీరో గోవిందా కామెంట్ వేసాడు. నటుడిగానా? వ్యక్తిగానా? అంటూ జర్నలిస్టులు అడిగితే— అంత వివరంగా చెప్తే ఎలా? అమితాబ్‌లా మర్మగర్భంగానే నా సమాధానాలుంటాయి అంటున్నాడు గోవిందా.

"ప్లీజ్ శ్రీదేవీ, నేనేం పాపం చేసానని నన్నిలా బాధపెడ్తున్నారు. నేను మనఃశాంతిగా వుండడం మీకిష్టం లేదా? నేనేమన్నా మిమ్మల్ని ప్రేమించమని అడిగానా పెళ్ళిచేసుకోమని అడిగానా? ప్రేమించడం నా తప్పుకాదే. ఎందుకింత వేధిస్తున్నారు. మీరు నాతో మాట్లాడకండి. మాట్లాడి నా మనసుని నా అదుపులోంచి తప్పించకండి..." రెండు చేతులు జోడించి దండం పెడ్తూ అన్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తన దృష్టిని దాటిపోలేదు. తన హృదయం ద్రవించిపోయింది. మనసు అతనిని కోరుకుంటూంది. తనింక ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రసాద్‌తో కాపురం చెయ్యలేదు. బ్రతికే రెండు రోజులూ హాయిగా సంతోషంగా బ్రతకాలనుంది. మనసులేని వాడితో శిలలా సంసారం చేసేకన్నా అతడిని వదిలి తనని మనసారా కోరుకుంటున్న తనకి నచ్చినవాడితో లేచిపోవడం మేలు.

తన ఆలోచనలు ఇలా వున్న సమయంలో హఠాత్తుగా.

"శ్రీదేవీ, నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. మీకు అభ్యంతరం లేకపోతనే. మీరు లేకుండా నేను బ్రతకడం నావల్ల కాదు అని తేలిపోయింది. ఇక ఈ నరకాన్ని అనుభవించలేను. మీకు నేనిష్టమయితే మీ వారినీ, ఇంటినీ వదిలి నా దగ్గరికి రండి. ఈ వూరు వదిలేసి దూరంగా వెళ్ళిపోదాం. రేపు సాయంత్రం రైల్వేస్టేషన్లో మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను. ఇంకొక విషయం గుర్తుంచుకోండి. మీరు రాకపోతే ఇక... ఏ రైలు కిందో..." పంటికింద బాధని నొక్కిపట్టి వెళ్ళిపోయాడు. చెప్పడానికి గొంతు పూడుకుపోయిందేమో.

ఆ రేపు ఈ రోజే.

ఆఫీసుకి వెళ్ళకుండా కూర్చుని ఆలోచిస్తోంది.

అతనితో వెళ్ళడానికే నిశ్చయించుకుంది.

ఏ వూర్లోనో ఒక వూర్లో హాయిగా జీవితాన్ని గడపవచ్చు.

ఈ రోజు ప్రసాద్‌కి నైట్ డ్యూటీ కూడా. అన్నీ కలిసి వస్తున్నాయి. ఆ దేవుడికి కూడా తను సుఖంగా వుండడం ఇష్టం లాగుంది.

ప్రస్తుతం ప్రసాద్ ఇంట్లోనే వున్నాడు.

అతన్ని చూస్తుంటేనే అసహ్యంగా వుంది. ఇంకొద్ది గంటలు మాత్రమే అతన్ని భరించాలి అంతేగా... ఆ తరువాత ఫ్రీ బర్డ్.

'పోస్ట్' కేక వినిపించి ఆలోచనల్లోంచి బయట పడింది.

ప్రసాద్ అందుకున్నాడు.

లెటర్ గురించి ఎక్కువగా ఆలోచించలేదు కానీ పరపరా చింపుతున్నట్టు శబ్దం రావడంతో బయటకు వచ్చింది.

"ఏమిటీ... ఉత్తరం ఎక్కడ్నుంచీ..." అతనితో ఆ మాత్రం మాట్లాడ్డం కూడా ఇష్టం లేకపోయినా అడిగింది.

"ఏదోలే..." చెప్పలేదతను.

"ఏదోలే ఏంటీ ఎందుకు చింపేసావ్. ఎవరు రాసారు"

అందులో ఏం విశేషం లేదు దేవీ. లోపలికెళ్ళి పడుకో... పో, నీరసంగా వున్నావు అసలే..."

దొంగ ప్రేమ అంతా... ఛ...

"ప్చ్... ఎక్కడ్నుంచో చెప్పండి?" అతను చెప్పకపోతే ఇంకా క్యూరియాసిటీ పెరిగిపోతోంది.

ప్రసాద్ ఏం మాట్లాడలేదు. ఇక అతన్ని అడిగి లాభం లేదనుకుని ప్రసాద్ వద్దని వారిస్తున్నా చింపి క్రిందపడేసిన కాగితాలని ఏరింది.

"దేవీ!! నీ మొండిపట్టు నీదే కదా? అనవసరమయినవి చదివి ఎందుకు మనసు పాడుచేసుకుంటావు చెప్పు..." అతని మాటలని పట్టించుకునే స్థితిలో లేదు.

అన్నింటినీ వరుసలో పేర్చింది.

"ప్రసాద్ గారూ!

నేనెవరో మీకు తెలియదు. కానీ మీ గురించి, మీ భార్య గురించీ చాలా బాగా తెలిసినవాడిని. ఈ ఉత్తరం ప్రత్యేకంగా ఎందుకు రాస్తున్నానో ఈ ఉత్తరం పూర్తిగా చదివితే మీకే అర్థమవుతుంది. మీ భార్య తాజ్ లూజ్ కారెక్టర్ లేడీ. ఆమె వాళ్ళ కొలీగ్‌తో లేచిపోదామని ప్లాన్

చేసుకుంది. ఈ రోజు సాయంత్రమే ప్రయాణం. నా మాట అబద్ధం అవుతే రైల్వేస్టేషన్‌కి వెళ్ళి పరీక్షించండి."

ఇట్లు,
మీ మేలుకోరే,
... ... ...

ప్రసాద్ తల వంచుకుని నిల్చున్నాడు.

అతని మొహంలో ఏం కోపం లేదు నిశ్చలంగా వుంది.

"ఏమండీ" పిలిచేప్పుడు గొంతు వణికింది. చాలా రోజుల తర్వాత గౌరవంగా పిలిచింది.

క్షణకాలం (?) శ్రీదేవి వేపు చూసాడు.

"మీరు... మీరు దీనిని నమ్ముతున్నారా? నన్ను అనుమానిస్తున్నారా?" కళ్ళ వెంట నీళ్ళు జలజలా రాల్తున్నాయి ఎందుకో తెలీదు.

"ఛ... ఏం మాటలవి. పిచ్చిదానా, నీ మీద నాకు అనుమానమేంటి? ఎవరో ఏదో చేతికి తెగులుపుట్టి రాసినంత మాత్రాన ఆ ఉత్తరాన్ని నమ్మి నా ప్రాణమయిన నిన్ను అనుమానిస్తానా? నిన్ను అనుమానిస్తే నా మీద నాకు నమ్మకం లేనట్టే దేవీ..." అతనికి తన మీద వున్న నమ్మకానికీ, ప్రేమకీ అభిమానానికీ ఆశ్చర్యపోయింది. ఇతను తన భర్త ప్రసాదేనా ఇతనినేనా తను వదిలి వెళ్ళాలనుకుంది.

ప్రసాద్ గుండెలపై వాలిపోయి భోరున ఏడ్చింది.

"శ్రీదేవీ... ఏంటీ... ఏడుస్తున్నావెందుకు. వాడెవడో అలా నీ గురించి చీప్‌గా రాసాడని బాధగా వుందా?

ఇంతమంచి ప్రేమైకమూర్తిని అమాయకుడిని ఈ కుళ్ళు ప్రపంచంలో ఒంటరిగా వదిలేస్తే ప్రసాద్ ఏమైపోతాడు. తను మోసం చేస్తే ప్రసాద్ బ్రతగ్గలడా. అసలు... అసలు ఆ ఊహని భరించగలదా.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మర్నాడు ఏ పేపర్లోనూ శ్రీదేవి ఊహించినట్టు "రైలు క్రింద తలపెట్టుకుని యువకుడు ఆత్మహత్య" అని రాలేదు. నిక్షేపంగా అతను బ్రతికేవున్నాడు. వారం రోజుల తరువాత మనసు కుదుట పడ్డ తర్వాత ఆఫీసుకి వెళ్ళింది శ్రీదేవి. వేణుకి ఎలా మొహం చూపించాలో తెలియడం లేదు. అయినా తనేం అతనికి ఆశలు కల్పించలేదు కదా అని తనకి తాను సరిపెట్టుకుంది. వేణు ఎక్కడా కనిపించలేదు. ఆ తర్వాత తెల్సిందేంటంటే వేణుని పోలీసులు అరెస్ట్ చేసారట. సుఖంగా సంసారం చేసుకునే ఆడవాళ్ళకి తీపి కబుర్లు చెప్పి బుట్టలో వేసుకుని అరబ్ కంట్రీస్‌కి ఎగుమతి చేస్తాడట. ఇప్పటికి చాలా మంది ఆడవాళ్ళని అమ్మేసాడట" గుండె రఝల్లు మంది శ్రీదేవికి. ఎంతలో ఎంత ప్రమాదం తప్పింది. ఆకాశరామన్నకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది.

కానీ ఆమెకు తెలీని ఒక్క రహస్యం ఏమిటంటే ప్రసాదే ఆ ఆకాశరామన్న అని. ప్రసాద్ శ్రీదేవి తనని వదిలి వెళ్ళిపోతుందన్న సంగతి ఊహించి ఆమె కళ్ళకి కమ్మిన మబ్బుతెరలు వీడడానికి ఏం చేయాలో తోచక దొంగ ఉత్తరం సృష్టించాడని. వేణుపై ఎంక్వైరీ పెట్టించి అతని నేరాలని తిరగ తోడించాడని. ఇప్పుడే కాదు ఎప్పటికీ ఆమెకి తెలిసే అవకాశమే లేదు. ●

## అద్భుతప్రపంచం

# అతిగొప్ప అనుభవం



మనలో చాలా మంది చాలాసార్లు తామే గొప్ప అనుకోటం అందరి అనుభవంలో ఉన్నది. ఈ గొప్పలు చాలా రకాలు.

ఆస్ట్రేలియాకి చెందిన జార్జ్ ఫీలయ్యే గొప్పతనం చాలా విచిత్రమైంది. గొప్ప ధనవంతుడినని, చాలామంది అందగత్తెల పొందు లభించిన వ్యక్తినని, అందగాడినని జార్జి గొప్పతనం ఫీలవటం లేదు. వీటన్నింటికన్నా అతను ఎంతో గొప్పగా చెప్పుకునే విషయం బహు చిత్రమైంది.

1941లో జార్జిని ఒకసారి జైల్లో పెట్టారు. ఆ రోజుల్లో జార్జ్ ఒక షిప్‌లో పని చేసేవాడు. మొబిలీ తీరంలో షిప్ ఆగితే ఒక క్లబ్‌కి వెళ్ళాడు. ఆ క్లబ్‌లో ఆ రాత్రి జరిగిన దొమ్మీలో రౌడీల హడావిడిలో పోలీసులు అరెస్ట్ చేసిన వాళ్ళలో జార్జ్ కూడా వున్నాడు. అతని తప్పేం లేకపోయినా ఆ రాత్రి జార్జ్ జైలు పాలవక తప్పలేదు. ఎంతో మృదువుగా, సాత్వికుడిగా వున్న జార్జ్‌ని మిగిలిన తాగుబోతుల తోటి, రౌడీలతోటి ఒకే సెల్‌లో ఉంచడం ఇష్టంలేక అధికారులు అతన్ని మరో సెల్‌లోకి మార్చాలని ప్రయత్నం చేశారు. ఏ సెల్ ఖాళీ లేక డెత్ సెల్‌లో వుంచారు. అదే రాత్రి పట్టుపడ్డ ఎమర్సెన్‌ని కూడా అదే సెల్‌లో వుంచాల్సి వచ్చింది. ఆ మర్నాడు జార్జ్‌ని వదిలేసారు. కానీ ఆ రాత్రే తన జీవితపు గొప్ప రాత్రి అంటాడు జార్జ్.

మొత్తం ఆ ప్రాంతాన్నంతా గడగడలాడించిన బందిపోటు ముఠా పేరు జేన్స్‌గాంగ్. ఆ గాంగ్ ప్రధాన సహచరులలో ప్రతి ప్రదానమైనవాడు ఎమర్సన్. అప్పటికే ఎమర్సన్‌కి డెబ్బై ఏళ్ళు. తన పన్నెండో ఏట నుంచి భయంకరమైన దోపిడీలు చేసినవాడు ఎమర్సన్. జేన్స్‌గాంగ్ తాలూకు ఆఖరి వ్యక్తి ఎమర్సన్. అటువంటి ఎమర్సన్‌ని చూట్టమే కాక, ఒక రాత్రంతా అతనితో కలిపి గడిపిన ఏకైక సజీవ వ్యక్తి జార్జ్ ఒక్కడే. ఆ రాత్రి జార్జ్ అనుభవాలు అతను మరిచిపోలేకపోవటమే కాదు ఇప్పటికి అందరికీ ఎంతో ఇష్టంగా చెపుతాడు. "అంత పరమ భయంకరం దోపిడీ దొంగ ఎమర్సన్ ప్రవర్తనలో పసిపిల్లాడంత మృదువు మీకు తెలుసా... అంటాడు. నా జీవితానికి అతనితో గడపటం చాలా గొప్ప అంటాడు.

మానవ నైజం ఎంత చిత్రమో... ఒక దోపిడీ దొంగతో ఓ రాత్రి గడపటం నో గొప్ప ధనవంతుడికి అతి గొప్ప అనుభవం.

— రావు